సాక్షి
చిత్తూరు

సోమవారం । 30 । జూన్ । 2025



కిక్కిరిసిన బోయకొండ

ఆషాఢ మాసం తొలి ఆదివారం సరిహద్దు రాష్ట్రాల నుంచి జనం తరలిరావడంతో బోయకొండ కిక్కిరిసింది. - 8లో



గందరగోళంగా బదిలీలు

ఉమ్మడి జిల్లాలోని గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ గందరగోళంగా మారింది. - 8లో



మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

పలమనేరులోని టమాట మార్కెట్‌లో అగ్నిప్రమాదం సంభవించడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం పర్యటనకు ముందస్తు ఏర్పాట్లల్లో అధికారిక యంత్రాంగం నిమగ్నం అయ్యారన్నారు. జిల్లాకు సీఎం వస్తున్నందున పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నామని తెలిపారు.

'మా బిడ్డలను పాఠశాలలో చేర్చుకోండి సారూ'



తల్లిదండ్రులతో బడిఈడు పిల్లలు

రొంపిచెర్ల : 'మా బిడ్డలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోండి సారూ అంటూ సంచార జాతికి చెందిన తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను వేడుకుంటున్నారు'. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలోని రామిరెడ్డిగారిపల్లెకు చెందిన వంశీధర్, స్వాతి రొంపిచెర్ల మండలం, బేస్తపల్లెకు సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద పనులు చేసుకుంటూ సంచార జీవనం సాగిస్తున్నారు. వీరికి గీతిక (8), కీర్తి (6), కోమలి(4), గగన్ (20) అనే నలుగురు పిల్లలు ఉన్నారు. ఎక్కడ పని ఉంటే అక్కడ పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటున్నారు. తమ బిడ్డలను బడికి పంపుదామని అనుకుంటే వారికి ఆధార్ ఉంటేనే బడిలో చేర్చుకుంటామని ఉపాధ్యాయులు చెబుతున్నారని వాపోయారు. పిల్లలు నారావారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జన్మించారని వారికి జనన ధ్రువపత్రాలు తీసుకోలేదని తెలిపారు. దీంతో పిల్లల ఆధార్ కార్డులు నమోదు కాలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చర్యలు తీసుకుని తమ పిల్లలకు ఆధార్ కార్డులు మంజూరు చేసి పాఠశాలలో చేర్చుకోవాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

క్రమబద్ధీకరణకు రాయితీ గడువు నేటితో ఆఖరు

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ సబ్సిడీ చెల్లింపునకు సోమవారం చివరి రోజని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. గృహ వినియోగదారులు సర్వీసు తీసుకున్నప్పటికీ తదనంతరం లోడ్ వాడకం పెరిగిందన్నారు. ఇందు కోసం జూన్ 30లోపు స్వచ్ఛందంగా అదనపు లోడ్ చెల్లింపుపై 50 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. దీంతో జిల్లాలోని చిత్తూరు అర్బన్ డివిజన్‌లో 1,838, చిత్తూరు రూరల్ పరంగా 642, పుంగనూరు డివిజన్ పరంగా 812 కలిపి మొత్తం 3,292 మంది వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. వీటి ద్వారా 5,234 కిలోవాట్ల లోడ్ క్రమబద్ధీకరణ కాగా రూ.52,57,500 చెల్లింపులు జరిగాయని ఆయన వివరించారు.

డైట్ ప్రిన్సిపల్‌గా డీఈఓ వరలక్ష్మి

కార్వేటినగరం : జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ప్రిన్సిపల్‌గా చిత్తూరు డీఈఓ వరలక్ష్మి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో డైట్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ శేఖర్ ఉద్యోగ విరమణ పొందడంతో చిత్తూరు జిల్లా డీఈఓగా విధులు నిర్వహిస్తున్న వరలక్ష్మి డైట్ ప్రిన్సిపల్‌గా (ఎఫ్ఏసీ) బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న డైట్ కళాశాలల్లో అత్యున్నత స్థానంలో ఉన్న కార్వేటినగరం డైట్‌కు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అధ్యాపకులు సమయ పాలన పాటించి మంచి ఫలితాలు సాధించే దిశగా విధులు నిర్వహించి డైట్ కళాశాలకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకు రావాలని సూచించారు. ఇందులో భాగంగా కళాశాల అధ్యాపకులు డీఈఓ వరలక్ష్మిని సన్మానించారు.



కళ్లు కాయలు

మామిడి రైతులు దిగుబడుల విక్రయానికి అగచాట్లు పడుతున్నారు. ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. మామిడి కాయల అన్‌లోడింగ్ కోసం వాహనాలతో క్యూ కట్టారు. తిండీ తిప్పలు రోడ్డుపైనే చేస్తూ..కంటి మీద కునుకు లేకుండా జాగరణ చేస్తున్నారు. మా వంతు ఎప్పుడు వస్తుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. అన్నదాత ఇల్లు వదలి నాలుగు రోజులుగా రోడ్డు మీదే తిప్పలు పడుతున్నారు. ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ కాయలను అమ్ముకునేందుకు రైతుల అగచాట్లు అన్నీఇన్నీ కావు. రోజుల తరబడి రోడ్డుమీద ఉండడంతో వాహనాల్లోనే కాయలు పండుగా మారుతున్నాయి..మరో వైపు తోటల్లో కాయలు కోతకు వస్తుండడంతో ఈ బాధలేంటి దేవుడా అని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

అన్నదాతల అగచాట్లు

- అమ్మకానికి రోడ్డునపడ్డ రైతులు
- రోజుల తరబడి రోడ్డుపైనే తిండీ తిప్పలు
- వెంటాడుతున్న దొంగల భయం
- కునుకు తీయని అన్నదాతలు

కాణిపాకం : జిల్లాలో మామిడి రైతు సుడిగుండంలో చిక్కుకున్నారు. వీరి సమస్యలు తీరని వెతలుగా మారాయి. కాయలు కోతకొస్తే రైతులకు కన్నీళ్లు ముంచుకొస్తున్నాయి. ఫలం విక్రయానికి రోడ్డున పడుతున్నారు. రోజుల తరబడి రోడ్డుపైనే కునుకు తీస్తున్నారు. గొంతు తడుపుకోవడానికి, తిండికి తిప్పలు పడుతున్నారు. దీనికి తోడు దొంగల భయం వెంటాడుతోంది. కునుకు వేసేందుకు వణుకుతున్నారు. మామిడి విక్రయాలకు అన్నదాత అగచాట్లు పడుతున్నారు.

మామిడి పంటను సాగులోకి తెచ్చేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఆ కష్టానికి ప్రతిఫలం ఆస్వాదించ లేకపోతున్నారు. పంట కోతకొచ్చే సరికి పడరానిపాట్లు పడుతున్నారు. నిద్రలేని రాత్రులను గడుపుతున్నారు. కొన్నిరోజులుగా జిల్లాలోని మామిడి రైతుల పరిస్థితి ఇలా తయారైంది. ఇల్లు..వాకిలి వదిలి రోడ్డుపైనే కునుకుతీస్తూ...మామిడి పంటను అమ్ముకోవడానికి వారు అవస్థలు పడుతున్నారు.

గుక్కెడు నీటికి గగనమే

జిల్లా నలుమూలల నుంచి రైతులు వారు పండించిన పంటను కోత కోసి ఫ్యాక్టరీలకు అమ్మకానికి పెడుతున్నారు. ఈ తరుణంలో ఫ్యాక్టరీల వద్ద రైతులు అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ప్రధానంగా తాగునీటికి కూడా రైతులు ఇబ్బంది పడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి కి.మీ మేర వెళ్లి తాగునీటిని కొని తెచ్చుకుంటున్నారు. చుట్టూ పక్కల, రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి దుకాణాల్లో లేకపోవడంతో రోడ్లమీద వచ్చే వాహనాలను ఆశ్రయించి నీళ్ల బాటిళ్ల కోసం పరుగులు పెడుతున్నారు. అక్కడ కాలకృత్యాలకు కూడా వాటర్ బాటిళ్లే దిక్కుగా మారాయి. అలాగే ఆకలితో అలమటిస్తున్నారు. కడుపు నింపుకోవడానికి కూడా చాలా మంది హోటల్ వైపు చూస్తున్నారు. ఫ్యాక్టరీ వాళ్లు పంచి పెడుతున్న భోజనం పట్టక పలువురు హోటల్‌కు వెళ్తున్నారు. ఇలా రోజూ వారీగా రూ.700 వరకు ఖర్చు అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

రెప్పవేస్తే ఒట్టు..

బండి క్యూలో పెట్టిన రోజు నుంచి అన్‌లోడింగ్ అయ్యే వరకు రైతు కంటిపై రెప్పవేయడం లేదు. పగలు అలా కొద్ది సేపు బండి కిందే నిద్రోతున్నారు. రాత్రుల్లో నిద్ర పట్టక అల్లాడిపోతున్నారు. కంటిపై రెప్పవేస్తే ఆ మార్గాల్లో రయ్..రయ్ మంటూ వెళ్లే వాహనాల శబ్దాలకు ఉలిక్కిపడుతున్నారు. బలమైన గాలులు, వర్షాలకు అవస్థలు పడుతున్నారు. ఎండకు విలవిలలాడిపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో కనీస నీడలు లేక ట్రాక్టర్ కింద భాగంలో తలదాచుకుంటున్నారు.

ఫ్యాక్టరీల వద్ద వరుస కట్టి..

ఉమ్మడి జిల్లాలో 43 ఫ్యాక్టరీలుంటే..ఇందులో 31 ఫ్యాక్టరీలు మాత్రమే తోతాపురిని కొనుగోలు చేస్తున్నాయి. ఈ ఫ్యాక్టరీల ఎదుట రైతుల బాధలు వర్ణాతీతంగా మారాయి. గుడిపాల మండలం గొల్లమడుగు ప్రాంతంలోని ఓ ఫ్యాక్టరీ వద్ద రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సుమారు 700కు పైగా ట్రాక్టర్లు రోడ్డుకు ఇరువైపులా ఫ్యాక్టరీ గేటు నుంచి తమిళనాడు సరిహద్దును తాకాయి. జీడీ నెల్లూరులోని ఎట్టేరి వద్ద పరిస్థితి తీవ్రతరమవుతోంది. ట్రాక్టర్లు బారులు తీరడంతో తోతాపురి ట్రాక్టర్లోనే పండవుతోంది. పూతలపట్టు, చిత్తూరు, తవణంపల్లి, ఐరాల, పెనుమూరు, కార్వేటినగరం వద్ద ఉన్న ఫ్యాక్టరీల వద్ద వందల సంఖ్యలో ట్రాక్టర్లు రోడ్లను ఆక్రమించాయి. ఈ రకంగా క్యూ కట్టడంతో రైతులు రోజులు తరబడి రోడ్డుకే పరిమితమయ్యారు. కాయలు అన్‌లోడింగ్ అయ్యేందుకు 5,6 రోజుల సమయం కావడంతో రైతులు రోడ్డుపైనే బస చేస్తున్నారు.




గుడిపాల గొల్లమడుగు వద్ద క్యూకట్టిన ట్రాక్టర్లు

దొంగల భయం

రైతులకు కాయల కష్టంతో పాటు దొంగల భయం వెంటాడుతోంది. బండి వదిలి ఒక్క అడుగు ముందు వేసేందుకు వందసార్లు ఆలోచిస్తున్నారు. రాత్రి పూట బండిని వదిలి పక్కకు వెళ్లి కునుకు తీసేందుకు సాహసం చేయలేకపోతున్నారు. అలా బండిపైనే పడుకుని కాపాల కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. గుడిపాల మండలంలోని ఫ్యాక్టరీలు జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నాయి. జీడీ నెల్లూరులోనూ జాతీయ రహదారి పక్కనే ఫ్యాక్టరీ ఉంది. తద్వారా దొంగతనాలు జరగవచ్చునని రైతులు వణికిపోతున్నారు. ట్రాక్టర్లు, అందులోని పరికరాలు చోరీ అవుతాయని బండిని వదిలి వెళ్లలేకపోతున్నారు. ఈ భయం గుప్పెట్లో ఇళ్ల వాకిలి మరిచిపోయారు. శుభకార్యాలను వదులుకుంటున్నారు. బంధువులు చనిపోతే కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఇలా రైతులు అన్ని రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

నిద్రపోయి మూడు రోజులు అయ్యింది..



నేను 1.50 టన్ను కాయలే తెచ్చాను. దానికి కోసం నాలుగు రోజులుగా ఈడే ఉన్నా. నిద్రపోయి మూడు రోజులు అయింది. తిండి తినాలంటే కి.మీ నడవాలి. హోటల్‌కు వెళ్లి తింటున్నా. తాగేదానికి నీళ్ల తెచ్చుకోవాల్సిందే. దీనికి ప్రతి రోజు రూ.700 వరకు ఖర్చు అవుతోంది. ఈ అడవిలో ఉండలేకపోతున్నాం. గాలి ఒక్క పక్క. మరో పక్క ఎండలు. రాత్రుల్లో దొంగలు వస్తారని భయం. ఏం చేయాలి..అవస్థలు పడుతున్నాం. – గోవిందస్వామినాయుడు, ఏఎల్‌పురం, గుడిపాల

రోడ్డు మీదే అన్నీ



నాకు 7 ఎకరాల మామిడి తోట ఉంది. ఇప్పటికి ఒక లోడ్ కాయలను తోలాను. ఇప్పుడు మరో లోడ్ కాయలు తెచ్చాను. మూడు రోజులు అయింది. ఈ రోజుతో నాలుగో రోజు. కాయలు అన్‌లోడింగ్ అయ్యేందుకు మరో రెండు రోజులు పడొచ్చు. అంతా వరకు ఈ కష్టాలు తప్పవు. నీళ్లు పోసుకుని మూడు రోజులు అయింది. ఏదైనా తినాలన్న తమిళనాడు బార్డర్ నుంచి కి.మీన్నర వెళ్లాలి. – లక్ష్మణన్, మాపాక్షి, చిత్తూరు

రోజుల తరబడి పడిగాపులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 56 వేల హెక్టార్లల్లో మామిడి పంట వ్యాపించి ఉంది. ప్రధానంగా తోతాపురి 39,895 హెక్టార్లల్లో సాగవుతోంది. తద్వారా 4,9,274 మెట్రిక్ టన్నుల కాయలు దిగుబడి అయిందని ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ దిగుబడులను విక్రయించడానికి ఈ సారి రైతులు ముప్పు తిప్పలు పడుతున్నారు. కాయ కోతకోసి ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళితే పడిగాపులు కాస్తున్నారు. వందలాది ట్రాక్టర్లు కాయలతో క్యూ కడుతున్నాయి. ఈ గందరగోళంలో కాయలను అన్‌లోడింగ్ చేసేందుకు రైతులు రోజులు తరబడి వేచి చూడాల్సి వస్తోంది.





ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్ల వద్దే నిద్రపోతున్న రైతులు

అన్‌లోడింగ్‌కు ఐదు రోజులు

గుడిపాల : గుడిపాల మండలంలోని ఫుడ్ అండ్ ఇన్స్, తాసా జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద ట్రాక్టర్లు బారులు తీరి కిలోమీటర్ల మేర ఉన్నాయి. ఫ్యాక్టరీకి సంబంధించి చిత్తూరు-వేలూరు రహదారిపై ట్రాక్టర్లు బారులు తీరగా, తాసా జ్యూస్ ఫ్యాక్టరీకి సంబంధించి చెన్నై-బెంగుళూరు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఒక్కో ట్రాక్టర్ అన్‌లోడింగ్ సంబంధించి అయిదు రోజులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అన్‌లోడ్ కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు

ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకుందాం

- 'ఊరి బడిలో పిల్లలను చేరుద్దాం' కరపత్రిక ఆవిష్కరణ
- సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ



ఊరి బడిలో పిల్లలను చేర్పిద్దాం అనే కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సంఘం జిల్లా నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించుకుందామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆదివారం జిల్లా కార్యాలయంలో జిల్లాస్థాయి యూటీఎఫ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి, మంచి విద్యను అందించి, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి ప్రభుత్వ పాఠశాలను విద్యా కేంద్రాలుగా మార్చుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వం జీఓ 19ని అమలు చేసి 9 రకాల పాఠశాలలు ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 9,652 మోడల్ ప్రాథమిక స్కూళ్లు, 1–10 తరగతుల ఉన్నత పాఠశాలలు 1552, ప్రాథమికోన్నత స్కూళ్లను అప్‌గ్రేడ్ చేయగా 779 ఉన్నత పాఠశాలలు, ఫౌండేషన్ స్కూళ్లు 5000, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 19,000 ఏర్పాటు చేశారన్నారు. ఈ విధానం వల్ల ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారే ప్రమాదం ఉందని, వీటిని బలమైన స్కూళ్లుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తద్వారానే ప్రభుత్వ విద్యారంగం మనుగడ సాధ్యపడుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు సోమశేఖరనాయుడు, మణిగండన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు జూలై 5వ తేదీ వరకు చేపడుతున్న నమోదు డ్రైవ్‌లో యూటీఎఫ్ కేడర్ పాల్గొనాలన్నారు. 10 మంది పిల్లలను చేర్పించిన వారికి మండల స్థాయిలో, 20 మందిని చేర్పించిన వారికి జిల్లాస్థాయిలో అభినందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆ సంఘ నాయకులు ఊరి బడిలో పిల్లలను చేరుద్దాం అనే కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఆ సంఘం సహాధ్యక్షులు ఎస్ రెహానా బేగం, కే రెడ్డప్ప నాయుడు, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్పీ బాషా, పిఆర్ మునిరత్నం, జిల్లా కార్యదర్శులు ఏ కృష్ణమూర్తి, సిపి ప్రకాష్, కె సరిత, టి. దక్షిణామూర్తి, పంటపల్లి సురేష్, ఎం పార్థసారథి, పి సి బాబు, శశి కుమార్, ఎంసీ నిర్మల, తుంబూరు బాలాజీ, సాధన కుమార్, ఎస్ వి రమణ, మోహన్ రెడ్డి వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు 'రీకాల్ బాబు మేనిఫెస్టో' పోస్టర్ ఆవిష్కరణ



విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్ : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు మరిచారని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. సోమవారం దీనిపై పార్టీ జిల్లా కార్యాలయ ఆవరణలో 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పోస్టర్‌ను విడుదల చేయనున్నామన్నారు. ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల పార్టీ అధ్యక్షుడు భూమన కరుణకర్‌రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ పార్టీ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా వస్తారన్నారు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ అనే సరికొత్త కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేస్తామన్నారు. కూటమి సర్కారు చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు ఐదు వారాల పాటు ప్రచార కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఎన్నికల హామీల ద్వారా ప్రజలు పొందాల్సిన లబ్ధి ఇతర విషయాలు క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం, క్షేత్రస్థాయిలో నిర్వహణ తదితర అంశాలపై ముఖ్య నాయకులు దిశా నిర్దేశం చేస్తారన్నారు. నియోజకవర్గంలోని నాయకులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని విజయానందరెడ్డి కోరారు.

జులై నుంచి ఈ క్రాప్ సర్వే

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఖరీఫ్–2025కు సంబంధించి ప్రభుత్వం ఈ క్రాప్ డిజిటల్ సర్వే చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. జులై నెల ప్రారంభం నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుందన్నారు. ఎన్ఐసీ సంస్థ సహకారంతో డిజిటల్ విధానంలో ఈ సర్వేను చేపట్టనున్నారన్నారు. డిజిటల్ సర్వే ద్వారా సాగులో ఉన్న పంట వివరాలను పక్కాగా సేకరిస్తామన్నారు. తద్వారా రైతుల సంక్షేమ పథకాల అమలుకు దోహదమవుతాయన్నారు. కచ్చితంగా ఈ సర్వేను వంద శాతం పూర్తి చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

విద్యుత్ బిల్లుల నుంచి రూ.50.30 లక్షలు

చిత్తూరు కార్పొరేషన్ : ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు పని చేశాయని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈలు మునిచంద్ర, సురేష్ తెలిపారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించారన్నారు. మొత్తం 2605 మంది బిల్లులు చెల్లించగా తద్వారా రూ.50.30 లక్షలు వసూలు అయిందని వివరించారు.

నేటి నుంచి పుర కార్మికుల సమ్మె ఉధృతం



కమిషనర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ కార్మికులు

చిత్తూరు అర్బన్ : మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మెను ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం కార్మికులు చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇంజినీరింగ్, ఇతర అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించలేదన్నారు. సోమవారం నుంచి కార్మికులు ఎవరూ నీటి సరఫరా విధులకు హాజరుకాబోరని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో సమ్మెలోకి వెళుతున్నట్లు కమిషనర్‌కు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శరవణ, శివ కుమార్, వెంకటేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు పోలీసు గ్రీవెన్స్ రద్దు

చిత్తూరు అర్బన్ : చిత్తూరులో సోమవారం నిర్వహించాల్సిన పోలీసు గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నట్లు ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా గ్రీవెన్స్ రద్దు చేశామని, ప్రజలు ఎవ్వరూ కూడా వినతులు ఇవ్వడానికి చిత్తూరుకు రావొద్దని ఆయన సూచించారు.

పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా జూలై 1వ తేదీన సామాజిక పింఛన్ల పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జూలై 1వ తేదీన ఉదయం 7 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించేలా కసరత్తు చేస్తున్నామన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తామన్నారు. ఈ నెల 30వ తేదీన బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పంపిణీ కానీ పింఛన్ నగదును రెండురోజుల్లో బ్యాంకుల్లో తిరిగి చెల్లించాలని డీఆర్‌డీఏ పీడీ తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



గుడిపాల: మండలంలో ఆదివారం కారు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకుంది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని మద్రాస్ క్రాస్ రోడ్డు సమీపంలో లారీ చెన్నై రోడ్డు నుంచి వేలూరు వైపు తిరుగుతోంది. అదే సమయంలో వేగంగా వచ్చిన కారు లారీ కిందకు దూసుకెళ్లింది. లారీకి వున్న బంపర్లు తగులుకుని కారు ఆగిపోయింది. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

బైక్ దొంగ అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో పలుచోట్ల ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన రాజేష్ (20) అనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సీఐలు మహేశ్వర, నెట్టికంటయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. నగరంలోని రెడ్డిగుంట సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజేష్ అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా వెంబడించి పట్టుకుని విచారిస్తే.. నగరంలోని పలు ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడన్నారు. తమిళనాడులోని వేలూరు నగరానికి చెందిన రాజేష్ నుంచి రూ.3 లక్షల విలువ చేసే అయిదు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి రిమాండు విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

- వెంకటగిరికి చెందిన చెంచయ్య ఓ ప్రైవేటు కంపెనీలో చిరు ఉద్యోగి. ఇద్దరు పిల్లలు. కుమారుడు ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణుడయ్యాడు. తిరుపతిలో ఇంటర్ బైపీసీతో పాటు నీట్ కోచింగ్ ఇచ్చే కార్పొరేట్ సంస్థలో చేర్పించాడు. కళాశాల యాజమాన్యం ఏడాదికి రూ.3లక్షలు డిమాండ్ చేసింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో తన సతీమణి మెడలోని బంగారం తాకట్టు పెట్టి ఫీజు చెల్లించాడు. మరో కుమార్తె ప్రస్తుతం 10వ తరగతి చదువుతోంది. ఆమెకు తిరుపతిలోని ప్రైవేటు పాఠశాలలో ఏడాదికి రూ.80వేలు ఫీజు చెల్లిస్తున్నాడు. చదువులను రూ.లక్షల పోసి కొనే దుస్థితి దాపురించడం దారుణమని ఆవేదన చెందుతున్నాడు.'
- శ్రీకాళహస్తికి చెందిన నరసింహులు చిరువ్యాపారి. ఆయన పెద్ద కుమారుడు ఇంటర్ పూర్తి చేసి ఎంసెట్ రాశాడు. ఆశించిన ర్యాంక్ రాకపోవడంతో జిల్లాలోని పలు ప్రైవేటు కళాశాలలలో బీటెక్ సీఎస్‌ఈ కోర్సు కోసం దరఖాస్తు చేయించాడు. తిరుపతిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు విద్యార్థి సుముఖత చూపడంతో ఫీజు వివరాలను ఆరా తీశాడు. ఏడాదికి రూ.3.50లక్షలు ఫీజు కట్టాలని చెప్పారు. దీంతో తాను పొదుపు చేసుకున్న నగదుకు తోడు మరో రూ. 2లక్షలను బంధువుల దగ్గర రూ.5లకు వడ్డీకి తీసుకుని కళాశాలకు అడ్వాన్స్ రూపంలో చెల్లించి సీటు రిజర్వ్ చేసుకున్నాడు.



ఫీజులుం.. దారుణం

పిల్లలకు చదువు తప్ప ఇంకేం ఇవ్వగలం.. ఆస్తిపాస్తులు సమకూర్చలేని పరిస్థితుల్లో ఉన్నత విద్యను తప్ప ఇంకేం అందించగలం.. ఇదీ సగటు మధ్యతరగతి మనిషి ఆలోచనా విధానం. ఇదే అలుసుగా పలు విద్యాసంస్థలు కాసులు పోగేసుకుంటున్నాయి. అప్లికేషన్.. అడ్మిషన్.. టర్మ్ ఫీజుల రూపంలో తల్లిదండ్రులను నిలువునా దోచేస్తున్నాయి. ప్రస్తుతం అన్ని కాలేజీలు.. స్కూళ్లు ప్రారంభమైన సందర్భంగా ప్రవేశ రుసుము.. పుస్తకాలు.. అంటూ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. బిడ్డలకు చక్కటి భవిష్యత్ అందించేందుకు అమ్మానాన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. విద్యార్థులకు అవసరమైనవన్నీ కొనుగోలు చేసేందుకు అధిక వడ్డీల భారం మోస్తున్నారు. బంగారు నగలతోపాటు పుస్తెలను సైతం తాకట్టు పెట్టుకుని చదువులను కొంటున్నారు.

తిరుపతి సిటీ : జిల్లాలో కేజీ నుంచి పీజీ వరకు అన్ని విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ పాఠశాలల్లో దాదాపు పూర్తికాగా, ఇంటర్, ఇంజినీరింగ్, మెడికల్, డిగ్రీ, పీజీ కళాశాలలో ఇప్పుడిప్పుడే ప్రవేశాలు ఊపందుకుంటున్నాయి. తమ పిల్లలు ఇంజినీర్, డాక్టర్ కావాలనే కోరికలతో తల్లిదండ్రులు జిల్లాలోని పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థల వెంటపడుతున్నారు. దీంతో కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రుల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునేందుకు ఫీజులను ఆమాంతం పెంచి దండుకుంటున్నాయి. విద్యాసంస్థలు చెప్పింనంత ఫీజు చెల్లించేందుకు తల్లిదండ్రులు వడ్డీ వ్యాపారులు, కుదువ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా వడ్డీ వ్యాపారులు రూ.5 నుంచి రూ.10ల వరకు డిమాండ్ చేస్తూ ప్రామిసరీ నోట్లు రాయించుకుని, ఖాళీచెక్కులను తీసుకుని నగదు ఇస్తున్నారు. అలాగే ఫీజుల చెల్లింపులకు పలువురు ఇంటిలోని బంగారం తాకట్టు పెట్టేందుకు కుదువ వ్యాపారులను సంప్రదిస్తున్నారు. దీంతో జిల్లాలోని పాన్ బ్రోకర్ షాపులు సైతం ఈ నెల కళకళలాడుతున్నాయి. వారు కూడా బంగారును తాకట్టు పెట్టుకుని రూ.3లు నుంచి రూ.5 వడ్డీతో నగదు అందిస్తున్నారు. వడ్డీకి సైతం చక్రవడ్డీ వర్తిస్తుందని సంతకాలు తీసుకుంటున్నారు.

- పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రుల ఇక్కట్లు
- ఫీజుల కోసం తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న స్కూళ్లు.. కాలేజీ యాజమాన్యాలు
- విద్యాసంస్థల్లో చేర్పించేందుకు తప్పని అప్పులు
- అధిక వడ్డీలతో ఎడతెగని పాట్లు
- పుస్తెలు సైతం తాకట్టు పెడుతున్న మాతృమూర్తులు

కాళ్లరిగేలా తిరుగుతున్నాం



మాది అనంతపురం. 15ఏళ్లుగా తిరుపతిలో ఉంటున్నాం. భవన నిర్మాణ కూలీలుగా పనిచేసుకుంటూ బతుకీడుస్తున్నాం. ముగ్గురు పిల్లలు. పెద్ద అమ్మాయికి మా దగ్గర ఉన్న సొమ్ముతో ఇటీవలే పెళ్లి చేశాం. మూడో అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో పది చదువుతోంది. రెండో అమ్మాయి మంచి మార్కులతో ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసింది. కానీ, పైచదువులకు పంపాలంటే భయమేస్తోంది. అయితే మాలాగా కష్టం చేయకూడదని బాగా చదివించాలనే కోరిక ఉంది. ఇంజినీరింగ్ కళాశాలలో రూ.లక్షలు అడుగుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై నమ్మకం పెట్టుకోవద్దని చెబుతున్నారు. దీంతో అప్పు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం. – శారద, భవన నిర్మాణ కూలీ, తిరుపతి

వడ్డీకి తెచ్చాం



పిల్లలను చదివించాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మా అమ్మాయి ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి వరకు చదివింది. పదో తరగతి కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో చేర్పించాం. ఏడాదికి హాస్టల్‌తో పాటు మొత్తం ఫీజు రూ.1.80వేలు కట్టాల్సి వచ్చింది. దాచుకున్న రూ.50వేలకుతోడు మరో రూ.1.30వేలను వడ్డీవ్యాపారుల వద్ద రూ.5లకు వడ్డీకి తెచ్చి కట్టా. ప్రభుత్వ విద్యాసంస్థలు కార్పొరేట్ స్థాయిని అందుకుంటే ఇలాంటి పరిస్థితి రాదు. నేను చిన్న ఉద్యోగిని. నా భార్య దివ్యాంగురాలు. మా కష్టం పిల్లలకు రాకూడదని అప్పు చేసి చదివిస్తున్నాం.
– రామకృష్ణ, ప్రైవేటు ఉద్యోగి, గూడూరు

తిప్పలు తప్పడం లేదు



నేను తిరుపతిలోని ఓ ప్రముఖ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నా. నా భార్య సైతం ఓ ప్రైవేటు షాపులో పనిచేస్తోంది. ఇద్దరి జీతం నెలకు రూ.26వేలు వస్తాయి. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఓ అమ్మాయి పదో తరగతిని ఈ ఏడాది పూర్తి చేసింది. ప్రైవేటు కళాశాలలో ఎంపీసీలో చేర్పించాం. జేఈఈ మెయిన్స్ కోచింగ్ ఇస్తామని ఏడాదికి రూ.1.50లక్షలు చెప్పారు. ప్రస్తుతం అప్పు చేసి రూ.లక్ష కట్టాం. మరో అమ్మాయి ఇంటర్ పూర్తి చేసింది. ఇటీవల విడుదల చేసి నీట్ ఫలితాలలో 480మార్కులు సాధించింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నాం. ఆ అమ్మాయి చదువు కోసం విలేజీలో ఉన్న పొలాన్ని అమ్మకానికి పెట్టాం.
– శివశంకర్, డెలివరీ బాయ్, తిరుపతి రూరల్

చదువు కొనాల్సి వస్తోంది



విద్య వ్యాపారంగా మారిపోయింది. జూన్ వచ్చిందంటే మాలాంటి మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి దారుణం. పిల్లల చదువులకు అప్పులకోసం వెతుకులాట తప్పడం లేదు. నేను తిరుపతిలో ఓ విద్యాసంస్థలో తాత్కాలిక అధ్యాపకురాలిగా పనిచేస్తున్నా. నా భర్త దివ్యాంగుడు. వచ్చే జీతం ఇంటి ఖర్చులు, బాడుగకు సరిపోతుంది. ఇద్దరు పిల్లలు. పెద్ద అబ్బాయి డిగ్రీ పూర్తి చేసి చిన్న కంపెనీలో పనిచేస్తున్నాడు. మరో కుమారుడు ఇంటర్ పూర్తి చేసి నీట్ కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్నాడు. ప్రైవేటు కళాశాలలో సీటు వచ్చినా కనీసం రూ. 5లక్షలు కావాల్సిన పరిస్థితి. అందుకోసం ఇంట్లో బంగారం తాకట్టు పెట్టడంతో పాటు మరో రూ.2లక్షలు అప్పు చేయాల్సిందే. ఈ కాలంలో చదువును కొనాల్సి వస్తోంది. – శ్రావణ భార్గవి, అధ్యాపకులు, తిరుపతి

చదివించాలనే తపన



పిల్లలు మాలా కష్టాలు పడకుండా మంచి ఉద్యోగంలో స్థిరపడాలనే తపనతో అప్పులు చేసి ఉన్నతంగా చదివించేందుకు సిద్ధపడ్డాం. నా భర్త, నేను ఇద్దరం సొంతంగా తిరుపతిలో కిరాణా దుకాణం నడుపుతున్నాం. మాకు అబ్బాయి, అమ్మాయి కవల పిల్లలు. ఇద్దరూ ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేశారు. ఒకరి డాక్టర్ చేయాలనే ఆశతో ఇంటర్ ప్రైవేటు కళాశాలలో బైపీసీ చేర్పించాం. ఏడాదికి రూ.2లక్షలు ఫీజు కట్టాం. అమ్మాయిని తిరుపతిలో ఓ ప్రైవేటు కళాశాలలో ఎంపీసీ చేర్పించాం. ఫీజు ఏడాదికి రూ. 1.50లక్షలు చెప్పారు. ఇందులో రూ. 2లక్షలకు బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టాం. – ద్రాక్షాయిణి,
కిరాణా దుకాణం నిర్వాహకులు, రేణిగుంట

జిల్లా సమస్యలపై సీఎం స్పందించాలి

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు జిల్లాలో పలు సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. జులై 2, 3 తేదీల్లో జిల్లా పర్యటనకు వస్తున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ప్రధానంగా అత్యధిక సంఖ్యలో ఉన్న మామిడి రైతులు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర అమలు చేయడం లేదన్నారు. గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు కలెక్టర్ ఆదేశాలను లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రైతులు రోజుల తరబడి ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు పడుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా కుప్పం నియోజకవర్గంలో ఎయిర్‌పోర్టు కోసం జరుగుతున్న భూ సేకరణకు రైతులు అంగీకరించడం లేదని విమర్శించారు. జిల్లాలో అత్యధిక మండలాల్లో ప్రాథమిక పాఠశాలలను రద్దు చేసి పక్క గ్రామాల్లో కలపడంతో పిల్లల తల్లిదండ్రులు ప్రతిరోజు నిరసనలు చేపడుతున్నారన్నారు. మహిళలపై దాడులు పెరుగుతున్నా కట్టడి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

స్లో బైక్ రైడింగ్ పోటీలు



ట్రయల్‌లో పాల్గొంటున్న పోలీసులు

చిత్తూరు అర్బన్ : రహదారి భద్రతా నియమాలను పాటించడంలో భాగంగా త్వరలోనే చిత్తూరులో స్లో మోటారు సైకిల్ రైడింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు అన్నారు. ఆదివారం నగరంలోని ఆర్మ్‌డ్ రిజర్వు మైదానంలో పోలీసులకు ఈ పోటీలపై అవగాహన కల్పించడానికి ట్రయల్ నిర్వహించారు. హెల్మెట్లు పెట్టుకుని, డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉన్న వారు ఎవ్వరైనా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. వీలైనంత నిదానంగా వాహనం నడపగలగడమే ఈ పోటీ లక్ష్యమన్నారు. ఇప్పటికే చాలా మంది పేర్లు నమోదు చేసుకున్నారని, ఇంకా ఆసక్తి ఉన్నవాళ్లు 94910 74515 నంబరుకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లె : ఆషాఢ మాసం తొలి ఆదివారం బోయకొండ భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 30 వేల మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. వివిధ రకాల సేవా టికెట్ల ద్వారా ఆలయానికి రూ17.01 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఉచిత అన్నదాన పథకానికి 10 వేలు, గోశాల నిర్వహణకు రూ.5 వేలు విరాళాలు అందినట్లు పేర్కొన్నారు.

జేబుదొంగల చేతివాటం : బోయకొండలో రద్దీ పెరగడంతో భక్తుల జేబులకు జేబుదొంగలు చేతివాటం చూపిన ఘటన ఆదివారం వెలుగులో చూసింది. ఆ సమయంలో విధుల్లో ఉన్న పోలీసులకు భక్తులు తెలపడంతో ఈఓ ఏకాంబరం ఆదేశాల మేరకు ఆలయంలోని సీసీ కెమెరాల పర్యవేక్షణ చేస్తూ జేబుదొంగలను అదుపులోకి తీసుకొన్నారు. మేలూరు గ్రామం చిక్‌బలాపూర్‌కు చెందిన శివకుమార్ రూ.8 వేలు, బచ్చే గౌడ రూ.3 వేలను జేబుదొంగలు క్యూలైన్‌లో అపహరించారు. వెంటనే వారు అప్రమత్తం కావడంతో అక్కడే ఉన్న అనుమానితులపై పోలీసులు కన్నేశారు. బెంగళూరు కత్తర్‌గుప్పేకు చెందిన అలిమేలు, సంధ్య పట్టుబడగా మరికొందరు ముఠాసభ్యులు ఉడాయించారు. వారి వద్ద నుంచి రూ.9700 సొమ్మును స్వాధీనం చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఆషాఢమాసం కావడంతో ఆలయంలో రద్దీ అధికంగా ఉంటుందని, పోలీసులు నిఘా ముమ్మరం చేయాలని భక్తులు కోరుతున్నారు.

దహనక్రియలకు వెళ్లి వస్తుండగా..

- వేగంగా వచ్చి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొన్న టాటాఏస్
- శరీరం నుంచి తెగిపడిన తల





రోడ్డుపై పడి ఉన్న రమేష్ శరీరం, ప్రమాదానికి కారణమైన టాటాఏస్ వాహనం

శ్రీరంగరాజపురం : గ్రానైట్‌లోడుతో వేగంగా వచ్చిన వాహనం ద్విచక్రవాహనదారున్ని ఢీకొట్టడంతో శరీరం నుంచి తల వేరుపడి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లి దళితవాడకు చెందిన రమేష్ (44) శ్రీరంగరాజపురం మండలంలోని క్షీరసముద్రం గ్రామంలో తమ సమీప బంధువు మరణించడంతో దహనక్రియలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. అయితే 49 కొత్తపల్లిమిట్ట నుంచి గ్రానైట్ లోడ్‌తో వచ్చిన టాటాఏస్ వాహనం చిత్తూరు పుత్తూరు జాతీయరహదారి మర్రిపల్లి వద్ద రమేష్ బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో రమేష్ శరీరం నుంచి తల తెగి సమీప పొలంలో పడింది. అక్కడికక్కడే రమేష్ చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. అయితే టాటాఏస్ వాహనం అతివేగమే ఈ ప్రమాదానికి కారణం అని పశువుల కాపరులు తెలిపారు. తాము చూస్తుండగానే ఈ ప్రమాదం జరిగిందన్నారు. టాటాఏస్ వేగంగా వచ్చి రమేష్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిందన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం
– మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

మండలంలోని మర్రిపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన రమేష్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శనివారం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రమేష్ మరణించడం బాధాకరమన్నారు. రమేష్ కుటుంబాన్ని ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

టమాటా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం

పలమనేరు: పట్టణంలోని టమాటా మార్కెట్‌లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఇందులో మియాజ్‌కు చెందిన మండీకి నిప్పంటుకుంది. ఆపై మంటలు చెలరేగి పక్కనే ఉన్న అక్బర్, మదీనా ఫ్రూట్స్ దుకాణాలకు మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

అరుపులు.. కేకలతో కౌన్సెలింగ్!

- మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల్లో గందరగోళం
- దద్దరిల్లిన జిల్లా పోలీసు కార్యాలయం

చిత్తూరు అర్బన్ : సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల (ఎంఎస్‌కే) బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి అయిదేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు ఆదివారం చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో (డీపీఓ) కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి 10 గంటలకు దాటినప్పటికీ కౌన్సెలింగ్ కొనసాగింది. ఈ సందర్భంగా తమకు న్యాయం జరగడంలేదంటూ పలువురు ఉద్యోగుల అరుపులతో డీపీఓ దద్దరిల్లింది. దీంతో ఎస్పీ మణికంఠ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సచివాలయాల కుదింపు

చిత్తూరు, తిరుపతి, మదనపల్లెతో కూడిన పూర్వపు ఉమ్మడి జిల్లాలో దాదాపు 1,154 సచివాలయాలు ఉంటే.. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సంఖ్యను 400 కుదించే ప్రయత్నం మొదలుపెట్టింది. దీనికితోడు అయిదేళ్ల పాటు ఒకేచోట పని చేస్తున్న ఎంఎస్‌కేలను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన బదిలీల కౌన్సెలింగ్ చిత్తూరు ఎస్పీకు అప్పగించారు. అప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధించిన సిఫార్సు లేఖలను పలువురు ఉద్యోగులు తీసుకువచ్చి అధికారులకు అందిజేశారు. ఈ క్రమంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఎంఎస్‌కేలకు నో–ఆప్షన్ ఇవ్వాలని ఆయా కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. దీంతో డెప్యుటేషన్‌పై ఉన్న ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. తమను ఇష్టానుసారం ఎక్కడంటే అక్కడికి బదిలీ చేస్తున్నారంటూ కేకలు వేస్తూ ఆందోళనకు దిగారు. సచివాలయాలను కుదిస్తే తాము ఎక్కడికి వెళ్లి పనిచేయాలని ప్రశ్నించారు. ఇక స్పౌజ్ (భార్య, భర్త ఉద్యోగులు) కేసుల్లో ఆర్మీలో పనిచేసే వాళ్లను పరిగణలోకి ఎలా తీసుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎవరికైనా చెప్పుకోండి..

ఉద్యోగుల కేకలు వేస్తూ రచ్చ చేయడంపై ఎస్పీ మణికంఠ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో బదిలీ కౌన్సెలింగ్ ఆఫ్‌లైన్‌లో చేస్తుంటే, తాము ఖాళీలను చూపిస్తూ ఆన్‌లైన్‌లో సవ్యంగా చేస్తున్నామన్నారు. బదిరులు, అంగవైకల్యం, భర్తను కోల్పోయిన వాళ్లకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, ఆపై మిగిలిన పోస్టులను జనరల్ ఉద్యోగులతో బదిలీలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక స్పౌజ్ కేసుల్లో దేశం కోసం నిలబడ్డ సైనికులను మానవతా దృక్పథంతో పరిగణించి, పోస్టింగులు ఇచ్చామన్నారు. అనవసరంగా తమపై బురదజల్లితే సహించమని, గొడవలు చేసేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బదిలీల విషయంలో ఎవరికైనా అనుమానాలుంటే ఫిర్యాదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇక సోమవారం మరో 200 మంది ఎంఎస్‌కేలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. బదిలీల్లో కూటమి ప్రభుత్వం జారీ చేసిన తికమక ఉత్తర్వులు, సచివాలయాల కుదింపు నిర్ణయం.. ఉద్యోగులను అభద్రతాభావానికి గురిచేసింది.

గందరగోళంగా బదిలీలు





బదిలీ ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు, నిరసన వ్యక్తం చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

- సిఫార్సులకు పెద్దపీటపై సచివాలయ ఉద్యోగుల నిలదీత
- కౌన్సెలింగ్ కేంద్రంలో అసౌకర్యాలతో అవస్థలు

చిత్తూరు కార్పొరేషన్ : ఉమ్మడి జిల్లాలోని గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా సాగింది. ఆదివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో ఈ ప్రక్రియను ఉదయం నుంచి రాత్రి వరకు చేపట్టారు. చాలీచాలని స్థలంలో బదిలీలు నిర్వహించడంతో ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో పలువురు రోడ్డు పై నిలబడి కౌన్సెలింగ్ పిలుపు కోసం నిరీక్షించారు. బదిలీ కౌన్సెలింగ్‌ను ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల లేఖలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారని విమర్శలు నెలకొన్నాయి. తిరుపతి పరిసర మండలాల్లోని పంచాయతీ ఖాళీలను బదిలీ కౌన్సెలింగ్‌లో డిస్‌ప్లే చూపకుండా బ్లాక్ చేశారని బాధితులు వాపోయారు. సీనియార్టీ లో మొదటి 50 మందికి కూడా తిరుపతి పరసర ప్రాంతాలు చూపించకుండా 50, 60 కి.మీ. దూరంలోని పంచాయతీలను ఎంపిక చేసుకోవాలని అధికారులు ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత ఇంజినీరింగ్ సహాయకుల బదిలీ కౌన్సెలింగ్ భారీ సంఖ్యలో జరిగాయి. చిత్తూరు జిల్లా పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి ఈఈ రామ్మోహన్, మదనపల్లె ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను నిర్వహించారు. స్పౌజ్ కోటాలో సమీప పంచాయతీల ఎంపికకు అవకాశం కల్పించలేదని ఆరోపణలు గుప్పుమన్నాయి.

కేంద్రాల్లో ఆందోళన

నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ నిర్వహించారని ఉద్యోగులు కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లోని స్థానాలను బ్లాక్ చేయించినట్లు తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖాళీలు చూపకుండా మొక్కుబడిగా కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని నిరసిస్తూ కౌన్సెలింగ్ కేంద్రంలో ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కౌన్సెలింగ్ ప్రక్రియ రద్దు చేస్తామని అధికారులు హెచ్చరించడంతో అభ్యర్థులు ఆందోళనను విరమించారు. టీడీపీ ఎమ్మెల్యేల మితిమీరన జోక్యంతో కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళానికి దారి తీసింది.

సౌకర్యాల్లేక ఇబ్బందులు

రెవెన్యూ భవన్‌లో అధికారులు కనీస సౌకర్యాలు కూడ కల్పించలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో 664 మంది సచివాలయాల్లో ఇంజినీరింగ్ సహాయకులు ఉన్నారు. 650 చోట్ల ఖాళీలు ఉండగా దాదాపు 450 ఖాళీలు చూపించారని బాధితులు ఆరోపించారు. బదిలీ కౌన్సెలింగ్ సోమవారం కూడా జరగనుంది.